www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 18 ఏప్రిల్ 2025
5
అన్నమయ్య





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ఉపాధి కూలీల ఆకలి కేకలు

ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు ఆకలి కేకలు తప్పడం లేదు. రోజూ పనికి వెళ్లి చమటోడ్చి పనిచేస్తే కేవలం రూ.250-280 లోపు మాత్రమే కూలి వస్తుంది. ఆ కూలి డబ్బులు కూడా ప్రభుత్వం నెలల తరబడి చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో కుటుంబం మొత్తం కడుపు మార్చుకుంటూ జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కుటుంబ పోషణకు అప్పులు చేసుకుంటూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజూ జిల్లాలో వేల కుటుంబాల వారు ఉపాధి పనులకు వెళుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.



చాపాడు మండలంలో పనులు చేస్తున్న కూలీలు

మూడు నెలలుగా బకాయిల కోసం ఎదురు చూపులు

కూలి డబ్బులు చెల్లించకుండానే పనులకు రావాలని ఒత్తిడి

ఉమ్మడి కడప జిల్లాలో రూ.64 కోట్ల బకాయిలు

ప్రజాశక్తి - చాపాడు/రాయచోటి

ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో రూ.64 కోట్లు కూలీలకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఉపాధి హామీ చట్టం నిధుల కింద పల్లె పండుగ, మినీ గోకులాల ఏర్పాటుకు కూడా కోట్లాది రూపాయలు ప్రభుత్వం బకాయిలు చెల్లించాల్సి ఉంది. కడప జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా 40 వేల కుటుంబాల వారు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. 4 నుంచి 5 లక్షల మంది కూలీలు పనులకు వెళున్నారు. ఫిబ్రవరిలో 37,430 కుటుంబాలకు రూ.11 కోట్లు, మార్చి నెలలో 47352 కుటుంబాలకు సంబంధించి రూ.13 కోట్లు, ప్రస్తుతం ఏప్రిల్‌లో 40206 కుటుంబాల వారికి రూ.7 కోట్లు ఉపాధి కూలీలకు బకాయిలు రావాల్సి ఉంది. ఇందులో 8500 కుటుం బాలకు చెందిన 50 వేల మంది ఎస్‌సి కులాలకు చెందిన వారు, 400 ఎస్‌టి కుటుంబాలకు చెందిన 4వేల మంది పనులకు హాజరవుతున్నారు. అన్నమయ్య జిల్లాలో ప్రతినెలా 50 వేల కుటుంబాల వారు పనులకు హాజరవుతున్నారు. 5 లక్షల నుంచి 6 లక్షల మంది ఉపాధి కూలీలు పనులకు హాజరవుతున్నారు. ఫిబ్రవరికి సంబంధించి 51 583 కుంటుంబాలకు రూ. 16 కోట్లు, మార్చికి 44393 కుటుంబాలకు సంబంధించి రూ.13 కోట్లు ఏప్రిల్‌కు సంబంధించి 24422 కుటుంబాల వారికి రూ. 4.23 కోట్లు ఉపాధి కూలీలకు నగదు జమ కావాల్సి ఉంది. వీరిలో 8 వేల ఎస్‌సి కుటుంబాలకు సంబంధించి 85 వేల మంది, 1300 ఎస్‌టి కులాలకు సంబంధించి 15 వేల మంది ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఇలా పేద మధ్య తరగతికి చెందిన ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలకు నెలల తరబడి బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం జాప్యం చేయడం అన్యాయమని ప్రజా సంఘాల వారు పేర్కొంటున్నారు. రోజూ ఏదో ఒక మండలంలో నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్పందించి పెండింగ్‌లో ఉన్న మూడు నెలల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతున్నారు. లేనిపక్షంలో పేద ప్రజలు కూడా ఉపాధి పనులకు దూరమయ్యే పరిస్థితి కన్పిస్తుంది. ఇదిలా ఉంటే రోజూ కూలీల సంఖ్యను పెంచాలని జిల్లా ఉన్నతాధికారులు మండల స్థాయి సిబ్బందిపై ఒత్తిడి చేస్తున్నారు. వేసవి సీజన్ ప్రారంభం కావడంతో కూలీలకు పనులు చూపాలని కోరుతున్నారు. మూడు నెలలుగా కూలి అందకపోవడంతో పనులకు వచ్చేందుకు కూలీలు ఆసక్తి చూపడం లేదు. ఇతరత్రా వ్యవసాయ పనులకు వెళుతూ జీవనోపాధి పొందుతున్నారు. ప్రభుత్వం పాత బకాయిలను విడుదల చేస్తే కూలీల సంఖ్య కూడా పెరిగే పరిస్థితి ఉంటుందని తెలుస్తుంది.



ఏడు వారాల కూలి డబ్బు రావాలి

ఏడు వారాలకు సంబంధించిన కూలి డబ్బు రావాల్సి ఉంది. రోజూ పనికి వెళుతున్నా పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గతంలో ఒక వారం పనికి వెళితే మరో వారంలో కూలి డబ్బులు జమ అయ్యేది. ప్రస్తుతం నెలల తరబడి బకాయిలు చెల్లించడం లేదు.

- ఓబులేసు, అనంతపురం గ్రామం, చాపాడు మండలం.



బిల్లులు వెంటనే చెల్లించాలి

ఉపాధి పనులు చేసిన కూలీలకు 15 రోజులకు ఒకసారి బిల్లులు చెల్లించాలి. మూడు నెలలుగా బిల్లులు చెల్లించలేదు. జీవనం సాగించడానికి ఇబ్బందిగా ఉంది. కూలీలకు పనిముట్లు కూడా ఉచితంగా పంపిణీ చేయాలి. కూలి కూడా పెంచాలి. ఉదయం, సాయంత్రం పనులు కల్పించాలి.

- రెడ్డెప్ప ఉపాధి కూలీ, మద్దెలవాడ్లపల్లి, రాయచోటి మండలం.



కూలి త్వరగా చెల్లించాలి

నేను ఉపాధి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నా. గతంలో వారానికి ఓ సారి డబ్బుపడేది. ఇప్పుడు రెండు నెలలుగా ఇవ్వలేదు. కుటుంబం గడవడం కష్టంగా ఉంది. ఉపాధి పనులు ముగించేసి వ్యవసాయ పనులకు వెళ్లాలంటే అవి కూడా లేవు. కుటుంబ పోషణకు ఆసరాగా ఉన్న ఉపాధి పనులను సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలి.

-కె.అస్సానమ్మ, సోమిరెడ్డిపల్లె, బి.మఠం.



ఉపాధి పనులు కల్పించాలి

ఈ ఏడాది మా గ్రామంలో ఇంతవరకు ఉపాధి పనులు మొదలు పెట్టలేదు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ పనులు కూడా లేవు. సరుకుల ధరలు కూడా పెరిగి పోయాయి. అధికారులు స్పందించి వెంటనే ఉపాధి హామీ పనులను తమ గ్రామంలో ప్రారంభించాలి. గతంలో చేసిన పనులకు బిల్లులు వెంటనే అధికారులు చెల్లించాలి.

- ఎస్. వెంకటరమణ, ఉపాధి కూలీ, మాధవరం గ్రామం, రాయచోటి.



గాలివీడు మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



ఆందోళనపడొద్దు

ఉపాధి హామీ పనులకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా దాదాపు 3 నెలలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మూడు రోజులలో ఉపాధి హామీ బిల్లులు చెల్లిస్తాం. ఉపాధి కూలీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- వెంకటరత్నం, డ్వామా పీడీ, రాయచోటి.

వంద శాతం లక్ష్యాలను పూర్తి చేయాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వ పథకాల ప్రగతి సాధనలో వంద శాతం లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం విజయవాడ ఎపి సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఉచిత ఇసుక సరఫరా, సోలార్ ప్రాజెక్టులకు భూసేకరణ, సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల ఫిల్లింగ్ యాక్షన్ ప్లాన్, తాగునీటి సరఫరా, సానుకూల ప్రజా అవగాహన, ఎంఎస్ఎమ్ఇల సర్వే, నియోజక వర్గాలలో ఎంఎస్ఎమ్ఇ పార్కుల ఏర్పాటు, స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర తదితర అంశాలపై కలెక్టర్లు, ఎస్‌పిలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్, డిఆర్ఒ మధుసూదన్‌రావు హాజరయ్యారు. విసి అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 19న మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఈనెలలో 'ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీసైక్లింగ్' (ఈవేస్ట్‌రీసైక్లింగ్) అంశంతో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం సూచించిందని చెప్పారు. జిల్లా అంతట పరిశుభ్రత కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని, తడిపొడి చెత్తలపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. ఈ వేస్ట్ ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లో ఉంటుందని దాని పునర్వినియోగంపై ప్రజల్లో అవగాహన చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత ఇసుక పథకంలో భాగంగా జిల్లా అవసరాలకు తగినంత ఇసుక నిల్వలను సిద్ధం చేసుకోవాలన్నారు. వర్షాకాలంలో నీటి నిల్వ కారణంగా ఇసుక సేకరణ సాధ్యం కాదు కాబట్టి ఇప్పటినుంచి అవసరమైన మేర ఇసుక నిల్వలను పెంచుకోవాలని ప్రభుత్వం సూచించిందని ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టులలో నిఘాను పటిష్టం చేయాలన్నారు. పిఎం కుసుమ్ కార్యక్రమం ద్వారా జిల్లాలో సోలార్ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వేసవిలో జిల్లాలో ఎక్కడ కూడా త్రాగు నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇందుకు తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని ఆ మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవిలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను వనరుల ద్వారా పూర్తిగా నింపుకోవాలని సూచించారు. నీటి రవాణా అవసరమైన ప్రాంతాలలో ఏదైనా సమస్య వస్తే వెంటనే స్పందించి పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. పశువులకు నీటి తొట్టెల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న కూడా ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందిన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలపై ప్రజా సానుకూల అవగాహనను పెంచాలన్నారు. చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రజలలో తగిన అవగాహన కల్పించి సానుకూల దృక్పథం పెరిగేందుకు కృషి చేయాలని సూచించారు ఉద్యం పోర్టల్లో ఉన్న అర్హత కలిగిన యూనిట్లు అన్ని ఎంఎస్ఎం ఈ సర్వే పోర్టల్లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బిటి కళాశాలను యూనివర్సిటీగా ప్రకటించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్న కుమార్, అశోక్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె బిటి కళాశాలను యూనివర్సిటీగా ప్రకటించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్నకుమార్, అశోక్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాటాడుతూ బిటి కళాశాలను యూనివర్సిటీగా ప్రకటించడంతో పాటు పూర్తి స్థాయిలో ఫ్యాకల్టీని, సిబ్బందిని నియమించాలని కోరారు. మదనపల్లె మెడికల్ కళాశాల నిర్మాణాలను అర్ధాంతరంగా ఆపేశారని, పిపిపి పద్ధతిలో మెడికల్ కళాశాల నిర్వహిస్తామని ప్రభుత్వం మభ్యపెడుతూ ప్రయివేట్ పరం చేయడానికి ప్రయత్నం చేస్తోందన్నారు. పేదలకు వైద్యం దూరమవుతుందన్నారు. చైనా విద్యా సంస్థల కనుసన్నల్లో ప్రభుత్వం నడుస్తూ విద్యాహక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. ఫీజులు, పుస్తకాల పేరిట వేలల్లో ఫీజులు దండుకుంటున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, రమణ, విష్ణు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రైతులు డ్రోన్లను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతు సంఘాలకు 8 శాతం సబ్సిడీ డ్రోన్లను అందిస్తుందని రైతులందరూ అవకాశాన్ని సద్వినియోగ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.రామచంద్రనాయక్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కిసాన్ డ్రోన్లపై జిల్లా స్థాయి వర్క్‌షాప్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కిసాన్ డ్రోన్ పథకం మార్గదర్శకాలను వివరించారు. ప్రభుత్వం రైతు సంఘాలకు 80 శాతం సబ్సిడీపై డ్రోన్లను అందిస్తోందిన్నారు. డ్రోన్‌లు ఉపయోగించడం వల్ల పురుగు మందుల పిచికారి ఖర్చు తగ్గుతుందని చెప్పారు. ఎకరం పిచికారి 10 నిమిషాల్లో పూర్తి అవుతుందిన్నారు. అన్నమయ్య జిల్లాకు 34 డ్రోన్లు మంజూరయ్యాయి అన్నారు. రైతు సంఘాలు తమ గ్రూపు ఖాతాలో 50 శాతం జమ చేయాలని బ్యాంకులు 50 శాతం రుణం జారీ చేస్తాయని చెప్పారు. డ్రోన్ గ్రౌండింగ్ తర్వాత ప్రభుత్వం రైతు గ్రూప్ ఖాతాకు 80 శాతం సబ్సిడీని విడుదల చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎల్‌డిఎం ఆంజనేయులు, యూనియన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ పి. ప్రసాద్ పాల్గొన్నారు.

తలసేమియా బాధితుడికి ఎంపీ బాసట

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తలసేమియా వ్యాధిగ్రస్తుడుకి రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి బాసటగా నిలిచారు. పట్టణంలోని నీరుగుట్టువారిపల్లికి చెందిన తలసేమియా వ్యాధిగ్రస్తుడు చరణ్‌కు ప్రధానమంత్రి జాతీయ సహాయనిధి కింద రూ.3 లక్షలు మంజూరు చేశారని వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పేర్కొన్నారు. గురువారం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చరణ్ తాత, నానమ్మలకు రూ.3 లక్షలు మంజూరైనట్లు ప్రధానమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ తలసేమియాతో బాధపడుతున్న బాధితునికి రూ.3 లక్షలు ముంజూరు చేయించిన ఎంపీ మిథున్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో కౌన్సిలర్ ఈశ్వర్ నాయక్, కొత్తపల్లి మహేష్ బాబు, చిప్పిలి మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న బిజెపి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : భారతదేశంలో అంబేద్కర్ రచించిన రాజ్యాంగ వ్యవస్థలను కూల్చడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ యమలా సుదర్శనం ఆవేదన వ్యక్తం చేశారు. గురు వారం పట్టణంలోని మాల మహానాడు కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏకపక్ష ధోరణి వ్యవహరించడం బాధాకరమైన విషయ మన్నారు. చంద్రబాబు నాయుడు ఒకే కులానికి మద్దతు ఇవ్వడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు చంద్రయ్య, మనోహర్, వీరనాల మాణిక్యం, ఎలక్ట్రిషన్ మోహన్, జయశంకర్, గంగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.

వాల్మీకి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా దిలీప్

ప్రజాశక్తి - రాయచోటి : జిల్లా మహర్షి వాల్మీకి బోయ సంఘం ప్రధాన కార్యదర్శిగా బాలె రెడ్డి దిలీప్ జోషిని ఎన్నుకొన్నట్లు మహర్షి వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రభాకర్, ఉపాధ్యక్షుడు ఎస్.మహేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా దిలీప్ జోషి మట్లాడుతూ తనపై నమ్మకంతో అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. వాల్మీకి, బోయజాతి హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తానన్నారు.

విగ్రహాలు శుభ్రం చేయాలి

ప్రజాశక్తి -రాయచోటి : విగ్రహాలను శుభ్రం చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘాల నాయకులు కోరారు. గురువారం వారు మున్సిపల్ కమిషనర్ వాసు బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. రోడ్ల మధ్యలో ఉన్న వివిధ జాతీయ నాయకులు విగ్రహాలు, సంఘ సంస్కర్తల విగ్రహాలు, ప్రముఖుల విగ్రహాలు శిథిలావస్థకు చేరుకోకుండా శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డి.పద్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ, బి.చిన్నరెడ్డి, యూత్ ప్రెసిడెంట్ శరత్ కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలి : సిఐటియు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కార్మికుల విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 123 మున్సిపాల్టీలలో పనిచేస్తున్న పారిశుధ్యం, ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన 48 వేల మంది కార్మికులను ఆప్కాస్ నుండి తొలగించి ప్రయివేట్ సంస్థలకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయించడం దారుణమని పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బివి రమణ, చెన్నయ్య రాంబాబు, అక్బర్, శంకరయ్య, సిఐటియు కార్యదర్శి ఎ.రామాంజులు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామన్న హామీని తుంగలో తొక్కి లక్షలాది మంది కార్మికులను దగాచేసింది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ ఉద్యోగాలు పర్మినెంట్ అవుతాయని, టైంస్కేల్ ఇస్తారని, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అందుకు అనుగుణంగా తీర్మానిస్తుందని కార్మికులు ఆశించారని చెప్పారు. కూటమి ప్రభుత్వం కార్మికుల ఆశలను నెరవేర్చకపోగా పొరుగు సేవల సిబ్బందికి గుడ్డిలో మెల్లగా ఉన్న ఆప్కాస్‌ను రద్దుచేసి లక్ష మంది కార్మికుల జీవితాలను ప్రయివేట్ ఏజెన్సీ లకు కట్టబెట్టాలని నిర్ణయిస్తూ కార్మికులకు తీరని ద్రోహం చేయనుందని వాపోయారు. ప్రయివేట్ సంస్థకు అప్పగించడం అంటే కార్మికులకు ఉద్యోగభద్రత లేకుండా చేయడమేనని పేర్కొన్నారు. జీతభత్యాలలో కోతలు, పిఎఫ్, ఇఎస్ఐ నిధులు స్వాహా జరిగే ప్రమాదం ఉందన్నారు. గతంలో ప్రయివేట్ ఏజెన్సీల ద్వారా కార్మికులు దశాబ్దాల తరబడి ఎదుర్కొన్న కష్టాలు, బాధలు తలుచుకొని కార్మికులను తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ప్రభుత్వం పునరాలోచించి కార్మికుల మనోభావాలను దెబ్బతినకుండా చూడాలని ఇతరులెవరు చేయలేని విధులు నిర్వహిస్తూ పర్యావరణాన్ని, ప్రజారోగ్యాన్ని కాపాడటానికి తమ ప్రాణాలొడ్డి సేవలందిస్తున్న మున్సిపల్, పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికు లను పర్మినెంట్ చేయాలన్నారు. డిమాండ్ల సాధన కోసం మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు తిరుపాల్, సురేష్, సిద్దిమల్లు, లక్ష్మిదేవి, కేశమ్మ, వెంకటలక్ష్మి, సుభాషిణి, శ్రీనివాసులు, రెడ్డికుమార్, రమణ, వెంకటేశ్వర్లు, రమేష్ పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆప్కాస్ విధానాన్ని కొనసాగించి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు హామీల సాధన కోసం మున్సిపల్ కార్మికులు చేస్తున్న మూడవరోజు నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం కార్మికులు మోకాళ్ళపై నిలబడి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులను తాము అధికారంలోకి వస్తే కార్మికులను పర్మినెంట్ చేసి వేతనాలు పెంచుతామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆప్కాస్ విధానాన్ని రద్దుచేసి కార్మికులను తొలగించాలన్న కుట్రపూరితమైన విధానాన్ని అమలు చేసేందుకు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై పునరాలలోచన చేసుకొని ఆప్కాస్ విధానం కొనసాగించాలని, లేదంటే కార్మికులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని కోరారు. ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి పి.వి రమణ, నాయకులు ప్రసాద్, లక్ష్మీదేవి, ఎం.రమణ పాల్గొన్నారు.



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు



ఖాదర్ బాషాను సత్కరిస్తున్న ఎంఇఒలు, యుటిఎఫ్ నాయకులు

'కందుకూరి' విశిష్ట పురస్కార గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-పీలేరు

కందుకూరి విశిష్ట పురస్కారాన్ని అందుకున్న ప్రముఖ బహుభాషా కళాకారుడు, పాత్రికేయుడు, సామాజిక సేవా కార్యకర్త ఖాదర్‌బాష షేక్‌ను యుటిఎఫ్ నాయకులు ఘనంగా సత్కరించారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టివి, నాటకరంగ అభివృద్ధి సంస్థ బుధవారం తెలుగు నాటక రంగ దినోత్సవం-2025 రాష్ట్ర స్థాయి కందుకూరి ప్రతిష్టాత్మక రంగస్థల పురస్కారం, జిల్లా స్థాయి కందుకూరి విశిష్ట పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాంస్కృతిక, సినీ ఆటోగ్రఫీ శాఖామాత్యులు కందుల దుర్గేష్, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, నాటక, సినీ రచయిత బుర్ర సాయిమాధవ్, ఎపి చలనచిత్ర, టివి, నాటకరంగ అభివృద్ధి మండలి చైర్మన్ హిమాంశు శుక్లా హాజరై నాటక రంగంలో అత్యుత్తమ సేవలందిస్తున్న కళాకారులు, సాంకేతిక నిపుణులు, రచయితలు, దర్శకులకు రాష్ట్ర ఫిలిం, టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్రకటించిన పురస్కారాలను వారు ప్రధానం చేసిన విషయం విధితమే. కందుకూరి విశిష్ట పురస్కారాన్ని అందుకున్న పీలేరుకు చెందిన ఖాదర్ బాష షేక్‌ను గురువారం పీలేరు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పీలేరు, కెవి పల్లి మండలాల విద్యాశాఖ అధికారులు లోకేశ్వర్ రెడ్డి, పి.రెడ్డి బాష మాట్లాడుతూ ఖాదర్ బాష రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరెన్నో ఉన్నతమైన పురస్కారాలను అందుకోవాలని, పీలేరు కీర్తి ప్రతిష్టలను మరింత పెంచాలన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

చిరుత మృతిపై స్పందించిన డిప్యూటీ సిఎం

- విచారణాధికారిగా పిసిసిఎఫ్ చలపతిరావు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని పొన్నూటిపాళెం సమీపంలోని అటవీ ప్రాంతంలో వేటగాళ్లు వేసిన ఉచ్చుకు చిక్కుకొని చిరుత బలైన ఘటనపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ గురువారం సమగ్ర విచారణకు ఆదేశించారు. పిసిసిఎఫ్ చలపతిరావుని విచారణ అధికారిగా నియమించారు. పొన్నూటిపాళెం వద్ద ఆడ చిరుత ఉచ్చులోపడిపోయి కొన్ని గంటలపాటు నరకయాతన అనుభవించి, పెనుగులాడి చనిపోవడం, ఆ చిరుత కడుపులో రెండు కూనలు ఉండటం, ఆ కూనలు కూడా గర్భంలో చనిపోయిన విషయాలు పవన్ కల్యాణ్ దృష్టికి వెళ్ళాయి. క్షేత్ర స్థాయి నుంచి అందిన ప్రాథమిక సమాచారాన్ని, శాఖాపరంగా ఇచ్చిన సమాచారాన్ని పరిశీలించారు. ఘటన చోటు చేసుకున్న అనంతరం సంబంధిత అధికారులు ఏ విధంగా స్పందించారనే విషయాన్నీ తెలియచేయాలని ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లోనూ, అటవీ ప్రాంత సమీప గ్రామాల్లో జంతువుల కోసం ఉచ్చులు వేసే వేటగాళ్ళు, ఆ తరహా నేరాలు చేస్తున్నవారిపై నిఘా ఉంచాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పొన్నూటిపాళెం ఘటనపై విచారణను పర్యవేక్షించాలని అటవీ శాఖ సలహాదారు మల్లికార్జునవరావుకి దిశానిర్దేశం చేశారు.

అధికారిక లాంఛనాలతో చిరుతకు అంత్యక్రియలు

వేటగాళ్ల ఉచ్చులో పడి మృతి చెందిన చిరుతపులి, రెండు పిల్లల మృతదేహాలకు గురువారం అటవీ శాఖాధికారులు మాదన్న కొండలో అధికారిక లాంఛనాలతో దహనం చేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఒ జయప్రసాదరావు మాట్లాడుతూ పొన్నూటి పాళ్యం వద్ద వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకుని చిరుత పులి మృతి చెందిన విషయం తెలిసిందేనన్నారు. పశు వైద్యులు పోస్టుమార్టం చేశాక చిరుత పులిని పాతిపెడి పులిగోర్లు, శరీరం కోసం ఎవరైనా గుంతను తోడే అవకాశం ఉందన్నారు. అలాంటి వాటికి అవకాశం ఇవ్వకుండా ఉన్నతాధికారుల సూచనల మేరకు చిరుతపులి, పిల్లలను దహనం చేసినట్లు తెలిపారు.

చిరుత మృతికి కారకులైన ముగ్గురు అరెస్టు

చిరుత పులి మృతికి కారణమైన ముగ్గురిని అటవీ శాఖ అధికారులు గురువారం సాయంత్రం అరెస్టు చేశారు. ఎఫ్ఆర్ఒ జయప్రసాద్‌రావు కథనం మేరకు.. మదనపల్లె మండలం, పొన్నేటిపాలెం వద్ద మంగళవారం రాత్రి వేటగాళ్లు అడవి పందులకు తీసిన ఉచ్చులో చిక్కుకొని బుధవారం నరకయాతన పడి గర్భిణి చిరుత పులి చనిపోవడం తెలిసిందే. ఈ ఘటనలో అడవి పందులను వేటాడేందుకు ఉచ్చులు బిగించిన పొన్నేటిపాలెంకు చెందిన రెడ్డప్పరెడ్డి, వెంకటరమణారెడ్డి, గంగాధర్‌లను అరెస్టు చేశారు. మరికొందరిని కూడా అదుపులోకి తీసుకొని విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-నందలూరు

పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సహాలు అందిస్తోందని ఎంపిడిఒ రాధాకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఉద్యాన శాఖ, జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 2025-26 సంవత్సరానికి కొత్తగా పండ్ల తోటల పెంపకానికి అర్హులైన రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ గురించి రైతు సేవా కేంద్రం సిబ్బందికి, ఫీల్డ్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు రైతు సేవ కేంద్రం పరిధిలో కొత్తగా మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, బత్తాయి, నేరేడు, ఉసిరి,డ్రాగన్ ఫ్రూట్, అంజూర, చింత, పనస, అవకాడో, వంటి పండ్ల తోటల పెంపకానికి రాయితీ కోసం అర్హులైన రైతులను గుర్తించి, వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. రాజంపేట ఉద్యానధికారి జి.సురేష్‌బాబు మాట్లాడుతూ జాబ్ కార్డు లేని భూమి, నీటి వసతి కలిగిన రైతులు నూతనంగా పండ్ల తోటల పెంపకానికి ఉద్యాన శాఖ ద్వారా మొదటి మూడు సంవత్సరాలకు 40శాతం రాయితీ అందుతుందని తెలిపారు. ఆయిల్ పామ్ పెంపకానికి ప్రభుత్వం నుంచి మొదటి నాలుగు సంవత్సరాలలో సాగు రాయుతికి హెక్టార్‌కు రూ.21వేలు, అంతర పంటల సాగుకు ప్రతి సంవత్సరం హెక్టార్‌కి రూ.5,250లు రాయితీ అందించ బడుతుందని, ఈ అవకాశాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్ర మంలో ఇఒఆర్‌డి సునీల్‌కుమార్, వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య సహాయకులు, క్షేత్ర సహా యకులు, సువన్ ఆగ్రో ఇండస్ట్రీస్ మేనేజర్ కొండారెడ్డి పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పెద్దతిప్పసముద్రం మండల కేంద్రంలోని జడ్‌పి హైస్కూల్‌లో వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో యంగ్ ఇండియా ఫౌండేషన్ సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు యంగ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు జరుగుతుందన్నారు. గుండె సంబంధిత వ్యాధులు, కేన్సర్, దీర్ఘకాలిక కీళ్లు, ఎముకల నొప్పితో బాధపడుతున్న వారికి వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ప్రముఖ వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ, ఆయుష్మాన్ భారత్ పథకాల ద్వారా ఉచిత శస్త్రచికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఇసిజి, ఎకో, ముందస్తుగా కేన్సర్ వ్యాధిని గుర్తించేందుకు పాప్ సీమర్ టెస్ట్ తదితర పరీక్షలు ఉచితంగా చేయబడునన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గం ప్రజలకు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్నీ వివరాలకు ఆర్గనైజర్లు ఎలిగెంట్ హెయిర్ అండ్ బ్యూటీ సెలూన్ (అంగళ్లు) 9390262059, మమత శారీ సెంటర్ (పిటిఎం) 9110712823 యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ 9916073322 అనే మొబైల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

దళితుల అభివృద్ధే సిఎం చంద్రబాబు లక్ష్యం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు


మాట్లాడుతున్న నరసింహ ప్రసాద్

రాష్ట్రంలో దళితుల అభివృద్ధే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని టిడిపి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు పంతగాని నరసింహప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సిఎం పాలన సాగిస్తున్నారని అన్నారు. అందులో భాగంగా ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న దళితుల ఎస్‌సి వర్గీకరణ సమస్యతో మాల, మాదిగల మధ్య తెలియని అంతరం వచ్చిందని అన్నారు. నిజంగా దళితులలో మాదిగలు అభివృద్ధికి నోచుకోవడం లేదని, మాలల పరిస్థితి కూడా అలాగే ఉందని అన్నారు. సిఎం చంద్రబాబు రాజీవ్ మిశ్రా కమిటీతో ఒక కమిషన్ వేశారని, కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం ఎస్‌సిలను మూడు విభాగాలుగా ఒకటి రెల్లి, రెండు మాదిగ, మూడు మాలగా విభజించి జనాభా ప్రాతిపదికన ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న 2011 జనాభా లెక్కల ప్రకారం రెల్లికి ఒక శాతం,మాదిగకు ఏడు శాతం, మాలలకు ఎనిమిది శాతంగా వర్గీకరించి, 2026 జనాభా లెక్కలు వచ్చిన తర్వాత జిల్లాల యూనిట్‌గా జనాభా సేకరణతో దామాషా ప్రకారం ఫలితాలు అందించాలని నిర్ణయం చేశారని అన్నారు. మాల, మాది గలు కలిసి ముందుకు వెళితే తప్ప రాష్ట్రం బాగుపడదని అన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో దళి తులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించండి : ఎఇఒ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఇఒ ఆర్.రెడ్డిశేఖర్ పేర్కొన్నారు. గురు వారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి మండలంలోని స్థానిక బిసి కాలనిలో ఐదు సంవత్సరాలుపైబడిన పిల్లల గృహాల దగ్గరకు వెళ్లి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తెలిపారు.ప్రస్తుతం ఉన్న 151 విద్యార్థుల సంఖ్యను 2025-2026 విద్యా సంవత్సరానికి 200 దాటే విధంగా చూడాలని ప్రధాన ఉపాధ్యాయులకు,ఉపాధ్యాయ బృందానికి ఎంఇఒ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు.


ఘనంగా గంగమ్మకు బోనాలు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నందలూరు గ్రామ పంచాయతీలో వెలిసిన నడివీధి గంగమ్మకు గురువారం మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. తెల్లవారు జాము నుంచే గంగమ్మకు ప్రత్యేక పూజలు జరిగాయి. చుట్టూ పక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలి వచ్చారు. నిర్వాహకులు భక్తుల కోసం పెద్ద ఎత్తున అన్న దాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

పల్లెలకు రహదారి..పొలాలకు దారి కల్పించండి

- జాతీయ రహదారికి భూమి ఇచ్చిన రైతుల ఆవేదన
- సర్వీసు రోడ్డు నుంచి ప్రతి 300 మీటర్లకూ దారి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి


దారిలేని మామిడి తోట

ప్రజాశక్తి-పీలేరు

మదనపల్లి-తిరుపతి మార్గంలో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి తగినంత భూమి ఇచ్చిన రైతన్నల పొలాలకు దారి లేకుండా పోయింది. ఒకటి రెండు చోట్ల గ్రామాలకు వెళ్లే రహదారి కూడా కరువైన పరిస్థితులు పీలేరు మండలంలో చోటు చేసుకున్నాయి. పీలేరు మండలం, వేపులబైలు పంచాయితీ పరిధి లోని బాధిత రైతుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లి-తిరుపతి మధ్య వాహనాల రాక, పోకల రద్దీని నియంత్రించడంతో పాటు రోడ్డు ప్రమాదాలు నియంత్రించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నాలుగు లైన్ల రోడ్డు మంజూరు చేసి, నిధులు కూడా కేటాయించింది. టెండర్లు పూర్తయి యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది జూన్ నెలాఖరికి రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేసి ప్రారం భించాలన్న ప్రయత్నంలో అధికారులు, గుత్తేదారులున్నారు. జాతీయ రహ దారి నిర్మాణానికి తగినంత భూమి అప్పగించిన పీలేరు మండలం, వేపుల బైలు గ్రామ రైతులు ఇప్పుడు తమ పొలాల్లోకి వెళ్ళేదారిలేక వారు ఆవేదన చెందుతున్నారు. ఈ పంచాయతీ పరిధిలో హైవేకి 8 కిలోమీటర్ల పొడవునా రహదారికి ఇరువైపులా 194 మంది అన్నదాతలు 136 వేర్వేరు సర్వే నెంబర్ల నుంచి 70.38 ఎకరాల భూమిని హైవే నిర్మాణం కోసం అప్పగించారు. పంచాయితీ పరిధిలోని 15 గ్రామాలకు చెందిన, సుమారు రెండు వేల ఎకరాల విస్తీర్ణంలోని తమ భూముల్లోకి రైతులు పొలం పనుల వెళ్ళాలన్నా, పశువులు తోలుకు పోవాలన్నా దారి లేక ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంటోందని అన్నదాతలు తమ సమస్యను నిర్మాణం పనులు పర్యవేక్షించే సిబ్బందికి చెప్పుకుంటున్నా తగిన ఫలితం కనిపించలేదని వాపోతున్నారు. కంచంవారిపల్లె చెక్ డ్యాం నుంచి అనపకుంట, కొత్తచెరువు, బడవళ్ళవంక వరకు నాలుగు కిలోమీటర్ల పొడవునా సప్లై ఛానల్ కూడా నిర్మాణంలో ఉంది. రైతులు తమ పొలాలకు కాలువ దాటి వెళ్లడానికి కూడా ఇబ్బంది పడక ఆ రైతులకు తప్పేట్టు లేదు. పొలాలకు వెళ్లేందుకు ప్రతి 300 మీటర్లకు ఒకచోట సర్వీసు రోడ్డు నుంచి దారులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసుకుంటున్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా 3 అడుగుల ఎత్తున గోడ కూడా నిర్మిస్తుండడం గమనార్హం. ఇకనైనా సంబంధిత అధికారులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది.


తన వరి పొలానికి దారి లేదని చూపుతున్న చెబుతున్న భాస్కర్


పొలానికి దారి కావాలని కోరుతున్న పడగల చెంగమ్మ

కూలీలకు 'ఉపాధి' పనులు కల్పించాలి : పీడీ


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

ప్రజాశక్తి-రామాపురం

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు గిట్టుబాటు కలిగేలా రూ.307లు అందే విధంగా పనులు కల్పించాలని డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. మండలంలోని హసనాపురం పంచాయతీలో ఉపాధి కూలీలు చేస్తున్న పశువుల నీటి తొట్లు, పశుగ్రాస పెంపకం, హార్టికల్చర్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. మూడు నెలల నుంచి తమకు డబ్బులు పడలేదని కూలీలు ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. డబ్బులు పడని మాట వాస్తవమేనని వారం రోజుల్లో డబ్బులు కూలీల ఖాతా లో జమ అవుతాయని తెలిపారు. రైతులకు కావాల్సిన హార్టికల్చర్ పశువుల నీటతొట్లు పశుగ్రాస పెంపకం పనులను రైతులకు కల్పిస్తున్నట్లు చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఈ నెల చివరకి పనులు పూరి చేయా లన్నారు. ఎపిఒ పెంచలయ్య సమాధానం ఇస్తూ మండలానికి 69 నీటితొట్లు మంజూరు కాగా ఇప్పటికే 35 నీటి తొట్లు పూర్తి చేశామని తెలిపారు. పీడీ వెంట ఎపిడి లక్ష్మీ నరసయ్య, ఎపి పెంచలయ్య, ఇసి ఓబు లేసు, టిఎ. చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ రవిశంకర్‌రెడ్డి, పక్కిర్‌రెడ్డి, అల్లాబకాష్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పిల్లల ఆరోగ్యానికి పౌష్టిక ఆహారమే మార్గమని మదనపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ సుజాత పేర్కొన్నారు. పోషణ్ పక్వాడ్ పక్షోత్సవంలో భాగంగా గురువారం దిగువ మాచిరెడ్డిగారి పల్లి అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టిక ఆహారంపై ప్రదర్శనలను నిర్వహించి, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ పోషణ్ పక్వాడ్ పక్షోత్సవం కార్యక్రమాన్ని ఈనెల 8 నుంచి 22వ తేదీ వరకు నిర్వహి స్తున్నామని అన్నారు. పిల్లలకి అందిస్తున్న పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. చిన్న పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే సరైన పోషక ఆహారమే మార్గమని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలతో పాటు పిల్లలు తీసుకునే ఆహారంలో ప్రతిరోజూ ఆకుకూరలు, పాలు, గుడ్లు, పండ్లు ఉండాలని తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తల కూడా పిల్లల ఎదుగుదలను క్రమం తప్పకుండా పరిశీలిం చాలన్నారు. పిల్లల ఎదుగుదల లోపాలు ఉంటే వెంటనే వివరాలను నమోదు చేసుకుని, తగిన కారణాలను తెలుసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం వలన ఆరో గ్యంగా ఉంటూ పిల్లల ఎదుగుదలకు దోహదపడతారని వివరించారు. అంగన్వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఆహ్లాదంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు ప్రతిరోజు మెనూ ప్రకారం పోషకాహారాన్ని అందిస్తూ వస్తున్నామని తెలిపారు. కార్యక్ర మంలో సూపర్‌వైజర్ భానులక్ష్మీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.**బి. కొత్తకోట :** పోషకాహారంతో గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ సిడిపిఒ కే.భాగ్యమ్మ పేర్కొన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా బి.కొత్తకోట సెక్టార్ పరిధిలోని చంద్రమాకులపల్లి అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, చిన్నపిల్లలు తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఒ కే.భాగ్యమ్మ మాట్లాడుతూ వంద రోజుల సంరక్షణ కింద గర్భిణులు, బాలింతలు, రెండు సంవత్సరాలలోపు చిన్నారులు తీసుకోవాల్సిన ఆహారం, వారి ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. మాతా శిశుమరణాలు తగ్గించడం కోసం తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచే కాన్పు అయిన తర్వాత శిశువుకు మూడు సంవత్సరాలు వచ్చేవరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య సూచనలు, ఆహారపు అలవాట్లు, అంగన్వాడీలో ఇస్తున్న ఆహారం ఎలా తీసుకోవాలో వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ జి.హిజాద్ ప్యారి, జిఎం ఎస్‌కె.నిర్మల, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులైన గర్భవతులు, బాలిం తలు, చిన్నారుల తల్లుల పాల్గొన్నారు.


బి.కొత్తకోట : గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ భాగ్యమ్మ


నందినికి ప్రశంసా పత్రం అందిస్తున్న సుభాషిణి

ఉత్తమ విద్యార్థినికి బంగారు పతకం

ప్రజాశక్తి-పీలేరు

తెలుగు సబ్జెక్టులో అత్యుత్తమ మార్కులు సాధించే ఒక విద్యార్థినికి ప్రతి ఏటా బంగారుపతకం అందించి సత్కరిస్తానని తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యర్రదొడ్డి సుభాషిణి తెలిపారు. పీలేరు పట్టణంలోని అయ్యప్ప రెడ్డి కాలనీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని అయిన సుభాషిణి 1993లో ఇదే పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేశారు. గురువారం, పీలేరు అయ్యప్ప రెడ్డి కాలనీలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాల పట్ల కృతజ్ఞతా భావంతో 10వ తరగతి తెలుగు సబ్జెక్టులో అత్యుత్తమ మార్కులు సాధించే ఒక విద్యార్థినికి ప్రతి ఏటా తన తల్లిదండ్రులైన యర్రదొడ్డి చందన, కృష్ణారెడ్డిల జ్ఞాపకార్థం బంగారు పతకం అందజేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. అందులో భాగంగా 2023-24 విద్యా సంవత్సరంలో తెలుగు సబ్జెక్టులో 99 శాతం మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని పి.నందినికి బంగారు పతకం, ప్రశంసాపత్రం అందించారు. డాక్టర్ సుభాషిణి మాట్లాడుతూ ఈ పాఠశాల తన జీవితంలో మరువలేని మధుర జ్ఞాపకమని ఇక్కడ నేర్చిన పాఠాలు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం వల్లే తాను ఈ స్థాయికి చేరుకోగలిగానని చెప్పారు. ఎంఎ ప్రథమ శ్రేణిలో గోల్డ్ మెడల్ అందుకోవడం నా జీవితంలో ఒక గొప్ప మలుపని, అదే స్ఫూర్తితో, తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా విద్యార్థులకు ప్రోత్సాహం అందించేందుకు ఈ పతకాన్ని అందించే కార్యక్రమాన్ని ప్రారంభించానన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫౌజియా బేగం మాట్లాడుతూ డాక్టర్ సుభాషిణి తమ పాఠశాల పూర్వ విద్యార్థిని కావడం తమకెంతో గర్వకారణమని అన్నారు. విద్యలో ఉన్నత స్థాయికి చేరుకుని, తిరిగి తన పూర్వ పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహకారిగా నిలవడం నిజంగా స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈమె చేస్తున్న ప్రయత్నం మరెందరో పూర్వ విద్యార్థులను కూడా ప్రేరేపించగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సహాయ ప్రధానోపాధ్యాయిని జానం సుజాత, తెలుగు ఉపాధ్యాయులు గంగయ్య, బోధనా సిబ్బంది శ్రీకళ, ఉమా మహేశ్వరి, రెడ్డి దీపారాణి, ఇంద్రాణి, ప్రసన్నలక్ష్మి, రాధా రాణి, శైలజ, వ్యాయామ ఉపాధ్యాయిని సంపూర్ణమ్మ, విద్యార్థిని తల్లి లక్ష్మమ్మ, పాల్గొన్నారు.

హజ్ కమిటీ సభ్యుడిగా పఠాన్ ఖాదర్‌ఖాన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన హజ్ కమిటీలో సభ్యుడిగా మదనపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ పఠాన్ ఖాదర్ ఖాన్ ఎంపికయ్యారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషా, కూటమి నాయకులు గురువారం ఎమ్మెల్యే నివాసం వద్ద ఖాదర్‌ఖాన్‌ను దుశ్శాలువా కప్పి, పూల బొకేతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి గెలుపు కోసం అలుపెరగక కష్టపడిన ఖాన్‌కు పదవి రావడంతో ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని స్పష్టమౌతోందన్నారు. ఖాన్ పై అక్రమ కేసులు పెట్టి జైలులో పెట్టినా టిడిపిని వీడకుండా పార్టీకి విధేయుడిగా ఉన్నందుకు తగిన గుర్తింపు లభించిందన్నారు. ఖాదర్ ఖాన్ భవిష్యత్తులో మరిన్నీ ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. అనంతరం ఖాన్ మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుంచి తన తండ్రి పార్టీకి సేవలు అందిస్తున్నారని అదే తరహాలో తాను కూడా పార్టీకి విధేయుడిగా ఉన్నందుకు ఎమ్మెల్యే తనకు ఈ పదవి వచ్చేలా సహకారం అందించారన్నారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, మాజీ కౌన్సిలర్లు పులి మహాలక్ష్మి, రాధ, నాయకులు షంషీర్, సుదాకర్, నవీన్, రామకృష్ణ, శివన్న పాల్గొన్నారు.

పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-పుల్లంపేట

విద్యార్థులకు పరీక్షలే జీవితమా అనే అంశంపై ప్రిన్సిపల్ రూత్ మేరీ స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట, ఓబులవారిపల్లి, పెనగలూరు, చిట్వేలి మండలాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఐన్‌స్టీన్ జీవితాన్ని ఉదారంగా వివరించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు నిర్మలదేవి, మణెమ్మ మాట్లాడుతూ మార్కులు జీవితం కాదని అంతకు మించిన భవిష్యత్తు ఉందని విద్యార్థులకు తెలిపారు. పదవ తరగతి పరీక్ష ఫలితాలు వస్తాయని అందులో ఉత్తీర్ణత సాధించిన సాధించకపోయినా దాన్ని అవమానంగా భావించకూడదని మరో అవకాశం ఉంటుందని అన్నారు. ఇంతటితో జీవితం అయిపోదని ధైర్యాన్ని కోల్పోకుండా ఎటువంటి అఘాయిత్యాలకు పాల్పడ వద్దని ధైర్యంతో ముందడుగు వేసి విజయం సాధించాలని సూచిం చారు. చిట్వేలి ప్రిన్సిపల్ మాట్లాడుతూ తల్లిదండ్రులు దైవంతో సమానమని వారు లేని జీవితం లేదని విద్యార్థులు తెలిపారు. ఓబులవారిపల్లె ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించకపోయినా వారిని అవమానకరంగా మాట్లాడవద్దని వారిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్ర మంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దలవాయిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యా యులు రమణ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లిరాధాకృష్ణ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రప టానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తిలో ఉండి అనేక మహోన్నత పదవులు అలంకరించి ఉపాధ్యాయ వృత్తికే వన్నెతె చ్చారని కొనియాడారు. భారతదేశ మొదటి ఉపరాష్ట్రపతిగా పనిచేసి విద్యావేత్తగా, రాజక ీయవేత్తగా, అధ్యాపకుడిగా భారత దేశ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. ఆః అలాంటి మహనీయుని అడుగుజాడల్లో నడవడమే మనము వారికి ఇచ్చే ఘనమైన నివాళిని తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌గా అక్బర్‌బాషాను నియమించాలి

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని శెట్టివారి పల్లి గ్రూపులకు ఉపాధి పనులు కల్పించడానికి ఫీల్డ్ అసిస్టెంట్ గా అక్బర్ బాషాను నియమించాలని కోరుతూ డ్వాక్రా గ్రూపు సభ్యులు, మేట్లు వరలక్ష్మి, పార్వతమ్మ, గంగోజి, సరస్వతి, నాలుగు గ్రూపులకు చెందిన ఉపాధి కూలీలందరూ గురువారం ఎంపిడిఒ జవహర్‌బాబును కలిసి వినతి అందించారు.

సెలవుపై వెళ్లిన ఎంపిడిఒ విధులకు హాజరు

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక ఎంపిడిఒ సిఎ. జవహర్‌బాబు 30 రోజులు సెలవు పెట్టి గురువారం విధుల్లోకి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఉద్యోగ విరమణకు సంబం ధించిన ఫైళ్లు కొన్ని పెండింగ్‌లో ఉన్నాయని, ఆ పనులు నిర్వహించుకోవడానికి సెలవుపై వెళ్లినట్టు తెలిపారు. ఇకపై మండల అధికారులకు, ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు

రెండో విడత రీసర్వేపై గ్రామసభ

ప్రజాశక్తి-గాలివీడు


మాట్లాడుతున్న తహశీల్దార్ భాగ్యలత

రెండవ విడత రీసర్వే పై గురువారం గోపనపల్లిలో గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభను ఉద్దేశించి తహశీల్దార్ భాగ్యలత మాట్లాడుతూ గ్రామం లో 669 సర్వే నంబర్ల భూమి కలదని రెండో విడత రీసర్వేని రెండు మూడు రోజుల్లో ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ, సర్వేయర్, విఆర్ఒలు పాల్గొన్నారు.

అటవీ జంతువులు, మొక్కలపై క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని వివిధ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎకో క్లబ్ అనే కార్యక్ర మంలో భాగంగా ఫారెస్ట్ అధికారులతో సమన్వయంతో మండల విద్యాశాఖ అధికారుల ఆధ్వ ర్యంలో తుమ్మల బైలు రిజర్వ్ ఫారెస్ట్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఫీల్డ్ ట్రిప్ నిర్వహించారు. తుమ్మల బయలు రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్న బ్రిటిష్ కాలం నాటి గెస్ట్ హౌస్‌లో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీ దత్తాత్రేయ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యా ర్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఫారెస్ట్ అధికారులు ఫారెస్ట్‌లో లభించే మొక్కలు, జంతు వులు వాటి సంచారం గురించి తెలిపే ట్రాప్ కెమెరాను గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఇఒలు జి.చక్రధర్‌రాజు, డి.నాగతిరుమలరావు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ లీలాశ్రీహరి, జడ్‌పి హైస్కూల్ హెచ్ఎం వెంకటసుబ్బరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కెమెరాలో రికార్డు అయిన వన్య మృగాలను విద్యార్థులకు చూపుతున్న అటవీశాఖ అధికారులు

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనాలు ఢీ : పలువురికి గాయాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె


ప్రమాదంలో కాలుతున్న బైక్

రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు, పలువురికి స్వల్ప గాయాలైన సంఘటన నిమ్మనపల్లి మండలంలో గురువారం జరిగింది.స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. తవళంకు చెందిన ఎం.వంశీ మదనపల్లిలో నివాసం ఉంటు న్నారు. గురువారం తన తల్లి, కూతురితో కలసి తన ద్విచక్ర వాహనంపై మదన పల్లి నుంచి తవళంకు వస్తుండగా, రామస ముద్రం మండలం చెంబకూరు పంచాయతీ గజ్జల వారిపల్లెకు చెందిన హరీష్‌కుమార్‌రెడ్డి, తన స్నేహితుడు మహబూబ్‌భాషాతో కలిసి నిమ్మనపల్లెకు వచ్చి తిరిగి వెళుతుండగా మార్గమధ్యలోని చల్లావారిపల్లె సమీపంలోని భవాని నగర్ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి హరీష్ కుమార్‌రెడ్డి బైక్ ను ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ఘటనలో హరీష్ కుమార్ రెడ్డికి తీవ్ర గాయాలు కాగా, మహబూబ్ బాషాకు, వంశీకి, వారి కుమార్తెకు, తల్లికి స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. ప్రమాదంలో హరీష్ కుమార్‌రెడ్డి ద్విచక్ర వాహనం మంటలు చెలరేగి కాలి బూడిదైంది. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, క్షతగాత్రులను 108 వాహనం ద్వారా మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ తిప్పేస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వరకట్న వేధింపులపై మహిళ ఫిర్యాదు

ప్రజాశక్తి-రామసముద్రం

మహిళను వరకట్నపు వేధింపులకు గురిచేస్తున్నారని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే..మాలేనత్తం పంచాయతీ యరపశెట్టిపల్లి గ్రామానికి చెందిన నారాయణప్ప కుమార్తె లావణ్యను పెద్దపంజాణి మండలానికి చెందిన సునీల్ ప్రతాప్ అనే వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. వీరి కాపురం కొన్నాళ్లపాటు సజావుగా సాగింది. కొంత కాలంగా ఆమె అత్త గంగులమ్మ, భర్త సునీల్ ప్రతాప్ వరకట్నం తీసుకురావాలని వేధిస్తున్నారని గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.